

లిటిల్స్ మ్యూజీషియన్స్ సిల్వర్ జూబ్లీ వేడుకల్లో పాల్గొన్న మాజీ మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, సంగీత గురువు కొమాండూరి రామాచారి

## ఘనంగా 'లిటిల్ మ్యూజీషియన్స్ అకాడమీ' సిల్వర్ జూబ్లీ వేడుకలు

- హాజరైన మాజీ మంత్రి హరీశ్‌రావు

కొండాపూర్, జనవరి 21: లిటిల్ మ్యూజీషియన్స్ అకాడమీ.. బాల గాంధర్వం సిల్వర్ జూబ్లీ వేడుకలు ఆదివారం మాదాపూర్‌లోని శిల్పకళా వేదికలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు.. మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, చినజీయర్‌స్వామి, శోభారాజు, వరప్రసాదరెడ్డితో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిచయం అక్కర్లేని గొప్ప సంగీత గురువు లిటిల్ మ్యూజీషియన్స్ అకాడమీ వ్యవస్థాపకుడు కొమాండూరి రామాచారి అని కొనియాడారు. మట్టిలోని మాణిక్యాలను సింగర్లుగా ప్రపంచానికి పరిచయం చేస్తున్నదంటూ అకాడమీని ప్రశంసించారు. చదువు భారంతో విసిగిపోతున్న బాల్యానికి రామాచారి సంగీతం అనే ఉల్లాసాన్ని, వికాసాన్ని అందిస్తున్నారని పేర్కొన్నారు. ఇండియన్ ఐడల్ లాంటి షోలలో ఆయన శిష్యులు విజేతలుగా నిలవడం గర్వకారణమన్నారు. ఎంతోమంది పిల్లలకు ఉచితంగా శిక్షణ అందిస్తున్న రామాచారి సంస్థకు వ్యక్తిగతంగా సహాయ సహకారాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నట్టు హరీశ్‌రావు తెలిపారు. కార్యక్రమంలో పలువురు టాలీవుడ్ ప్రముఖులు, నిర్మాతలు, దర్శకులు, సింగర్లు పాల్గొని సందడి చేశారు.

## యాదగిరిగుట్టలో భక్తుల సందడి

యాదగిరిగుట్ట, జనవరి 21 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామివారి ఆలయంలో ఆదివారం భక్తుల సందడి నెలకొన్నది. భక్తులతో మాడవీధులు, ప్రసాద విక్రయశాలలు, క్యూ కాంప్లెక్స్, క్యూలైన్లు రద్దీగా మారాయి. స్వామివారి ధర్మ దర్శనానికి దాదాపు 3 గంటలు, ప్రత్యేక దర్శనానికి 2 గంటల సమయం పట్టిందని భక్తులు తెలిపారు. సుమారు 35వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకోగా ఖజానాకు రూ.46,63,688 ఆదాయం సమకూరినట్టు ఈవో రామకృష్ణారావు తెలిపారు.

## ఫిబ్రవరి 19నుంచి పాతగుట్ట బ్రహ్మోత్సవాలు

యాదగిరిగుట్ట, జనవరి 21 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి అనుబంధంగా కొనసాగుతున్న పూర్వగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం (పాతగుట్ట) 2024 వార్షిక బ్రహ్మోత్సవాలను ఫిబ్రవరి 19 నుంచి 25వ తేదీ వరకు నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో రామకృష్ణారావు ఆదివారం తెలిపారు. కాగా ఫిబ్రవరి 15 నుంచి 18 వరకు ఆలయంలో అధ్యయనోత్సవాలు నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ తేదీల్లో నిత్య కల్యాణం, హోమాలు రద్దు చేస్తున్నట్టు తెలిపారు. ఫిబ్రవరి 22న రాత్రి 8 గంటలకు నిర్వహించే స్వామివారి కల్యాణ టికెట్‌ను రూ.600గా నిర్ణయించినట్టు పేర్కొన్నారు. ఫిబ్రవరి 24న రాత్రి 8 గంటలకు దివ్యవిమాన రథోత్సవాన్ని పాతగుట్ట ఆలయం ముందుభాగం నుంచి స్వామివారి కల్యాణ మండపం వరకు ఊరేగిస్తామని, 25న అష్టోత్తర శతఘటాభిషేకంతో ఉత్సవాలు పరిపూర్ణం అవుతాయని తెలిపారు.

## గంగాజల సేకరణకు మెస్రం వంశీయులు

ఇంద్రవెల్లి, జనవరి 21 : ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలంలోని కెస్లాపూర్ నాగోబాకు ఫిబ్రవరి 9న అర్ధరాత్రి నిర్వహించే మహాపూజల కోసం హస్తలమడుగు నుంచి గంగాజలం తీసుకువచ్చేందుకు మెస్రం వంశీయులు బయలుదేరి వెళ్లారు. ఆదివారం సాయంత్రం కెస్లాపూర్‌లోని పురాతన నాగోబా ఆలయం (మురాడి)లో భద్రపర్చిన గంగాజల ఝరిని కటోడ కోసు, ధర్ము, హనుమంత్‌రావ్ బయటకు తీసి కటోడ కోసు వీపుపై తెల్లవస్త్రంతో కట్టారు. అనంతరం కటోడ కోసు, కటోడ కోసేరావ్, కటోడ హనుమంత్‌రావ్, పర్ధాంజీ దాదారావ్‌తోపాటు 150 మంది పాదయాత్రగా వెళ్లారు.

## రాత్రివేళలోనూ రాజన్న దర్శనం

వేములవాడ టౌన్, జనవరి 21: మేడారం జాతర సమీపిస్తుండటంతో వేములవాడ రాజన్నకు భక్తులు పోటెత్తుతున్నారు. ఈ నేపథ్యంలో ఆలయ అధికారులు ఈ ఆదివారం నుంచి ఫిబ్రవరి 18 వరకు ఆదివారాల్లో రాత్రివేళల్లోనూ స్వామివారి దర్శనానికి అవకాశం కల్పించారు. రాత్రివేళల్లోనూ కోడె, ఇతర మొక్కులు చెల్లించుకోవచ్చని సూచించారు. భక్తులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.



సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మల్లికార్జున స్వామి వారి క్షేత్రంలో భక్తుల రద్దీ



సమీప బావుల నుంచి నీళ్లు తెచ్చుకొంటున్న భక్తులు

# మల్లన్న క్షేత్రం.. భక్తజన సంద్రం

- పట్నం వారానికి 75వేల మంది రాక

చేర్యాల, జనవరి 21 : సిద్దిపేట జిల్లాలోని కొమురవెల్లి మల్లికార్జున స్వామి క్షేత్రం ఆదివారం భక్తులతో నిండిపోయింది. 'మల్లన్న స్వామి.. మమ్మేలు స్వామి' అంటూ భక్తుల నామస్మరణతో శైవక్షేత్రం పులకరించింది. పట్నం వారం సందర్భంగా హైదరాబాద్‌కు చెందిన 75 వేల మంది భక్తులు మల్లన్న క్షేత్రానికి తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. శనివారం సాయంత్రం నుంచే కొమురవెల్లికి చేరుకున్న భక్తులు ఆదివారం స్వామివారిని దర్శించుకోవడంతోపాటు అభిషేకాలు, పట్నాలు, అర్చన, ప్రత్యేక పూజలు, ఒడిబియ్యం, కేశఖండన, గంగరేగు చెట్టు వద్ద ముడుపులు కట్టడం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. మల్లన్న స్వామి సోదరి ఎల్లమ్మను దర్శించుకుని బోనాలు సమర్పించారు. ఈ వేడుకలో ఆలయ ఈవో ఏ బాలాజీ, పునరుద్ధరణ కమిటీ చైర్మన్ పర్పాటకం లక్ష్మారెడ్డి, కమిటీ సభ్యులు, సిబ్బంది, అర్చకులు, ఒగ్గు పూజారులు భక్తులకు సేవలందించారు. సోమవారం పెద్ద పట్నం, అగ్నిగుండాలు వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

### కరెంట్ లేక నీటికి కటకట..

ఉదయం 7 నుంచి మధ్నాహ్నం 2 గంటల వరకు కరెంటు సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో నీటి కోసం భక్తులు ఇబ్బందులు పడ్డారు. సమీపంలో ఉన్న సబ్‌స్టేషన్ వద్దకు వెళ్లి ట్రాన్స్‌కో సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. మోటర్లకు కరెంటు సరఫరా చేసే మెయిన్ జనరేటర్ సైతం మొరాయించడంతో భక్తులు అవస్థలు తప్పలేదు. సమీపంలోని వ్యవసాయ బావుల వద్దకు వెళ్లి రూ.20 చెల్లించి స్నానాలు చేయడంతోపాటు మరో రూ.20 చెల్లించి బిందెలో నీరు, రూ.50 చెల్లించి డబ్బాలో తాగు నీటిని తెచ్చుకున్నారు. మల్లన్న బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తామని దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ అధికారులతో నిర్వహించిన సమీక్షలో ప్రకటించినా, పట్నం వారం రోజున భక్తులకు నీటి తిప్పలు తప్పలేదు. గతంలో ఎన్నడూ ఇలాంటి పరిస్థితి తలెత్తలేదని పలువురు భక్తులు పేర్కొన్నారు. పారిశుద్ధ్య పనులు చేపట్టకపోవడంతో ఎక్కడి చెత్త అక్కడే అన్నట్టుగా ఉండటంతో భక్తులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.

# మూసీ రివర్ ఫ్రంట్‌పై ప్రత్యేక దృష్టి

- ప్రపంచం దృష్టిని ఆకర్షించేలా డిజైన్లు
- దుబాయ్‌లో సీఎం రేవంత్‌రెడ్డి చర్చలు
- దాదాపు 70 సంస్థల ప్రతినిధులతో భేటీ



ఆదివారం దుబాయ్‌లో ప్రముఖ సిటీ ప్లానర్లు, డిజైనర్లు, ఆర్కిటెక్ట్‌లతో సమావేశమైన సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, జనవరి 21 (నమస్తే తెలంగాణ): మూసీ రివర్ ఫ్రంట్ డిజైన్లు, అభివృద్ధిపై సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేకంగా దృష్టి సారించారు. లండన్ నుంచి బయల్దేరిన సీఎం ఆదివారం దుబాయ్‌లో ప్రపంచ స్థాయి సిటీ ప్లానర్లు, డిజైనర్లు, మెగా మాస్టర్ ప్లాన్ డెవలపర్లు, ఆర్కిటెక్ట్‌లతో వరుసగా భేటీ అయ్యారు. 56 కి.మీ. పొడవున మూసీ రివర్ ఫ్రంట్, గ్రీన్ అర్బన్ పార్కులు, షాపింగ్ కాంప్లెక్స్‌ల నిర్మాణాలకు సంబంధించిన డిజైన్లు, అభివృద్ధి నమూనాలు, వాటికి అవసరమైన పెట్టుబడులపై దాదాపు 70 సంస్థల ప్రతినిధులతో చర్చలు జరిపారు. దాదాపు అన్ని సంస్థలు తెలంగాణ ప్రభుత్వంతో భాగస్వామ్యానికి, హైదరాబాద్‌లో మూసీ రివర్ ఫ్రంట్ అభివృద్ధికి ఆసక్తి ప్రదర్శించాయి. తదుపరి సంప్రదింపుల కోసం త్వరలో రాష్ట్రానికి వచ్చేందుకు అంగీకరించాయి. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. చారిత్రక నగరాలన్నీ నీటివనరుల వద్దే అభివృద్ధి చెందాయని, మూసీ పునరుద్ధరణతో హైదరాబాద్ ప్రపంచంలోనే అద్భుత నగరంగా మారుతుందని అన్నారు. అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టనున్న మూసీ రివర్ ప్రాజెక్టుకు అపురూపమైన డిజైన్లు, నమూనాలు రూపొందించాలని కోరారు. ఇతర నగరాలు, రాష్ట్రాలతో తాము పోటీపడటం లేదని, ప్రపంచంలోనే అత్యుత్తమ ప్రమాణాలను నెలకొల్పేందుకు ప్రయత్నిస్తున్నామని చెప్పారు. దుబాయ్‌లో ఆదివారం పనిదినం కావడంతో సీఎం నేతృత్వంలోని రాష్ట్ర ప్రతినిధి బృందం అర్ధరాత్రి వరకు సంప్రదింపులు కొనసాగించింది. సమావేశాల్లో సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శేషాద్రి, పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి దానకిశోర్, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్‌రెడ్డి, హెచ్‌ఎండీఏ జాయింట్ కమిషనర్, మూసీ రివర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ ఆమ్రపాలి తదితరులు పాల్గొన్నారు. సోమవారం ఉదయం సీఎం హైదరాబాద్‌కు చేరుకుంటారు.

### దుబాయ్ వాటర్ ఫ్రంట్ ప్రాజెక్టు సందర్శన

పర్యటనలో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర అధికారులతో కలిసి దుబాయ్ వాటర్ ఫ్రంట్ ప్రాజెక్టును సందర్శించారు. స్కై స్కాపర్ (ఆకాశ హర్మ్యం) పైకి వెళ్లి వాటర్ ఫ్రంట్ అందాలను తిలకించారు. చుట్టూ నీళ్లు.. పక్కనే ఆకాశాన్ని అంటుతున్నట్లు కనిపించే అందమైన భవంతులు, నీళ్ల చుట్టూ అందమైన రహదారులతో ఒకదానికొకటి అనుబంధంగా రూపుదిద్దుకున్న ఈ ప్రాజెక్టు దుబాయ్‌లో పర్యాటకులను ఆకట్టుకొంటున్నది. ప్రాజెక్టు నిర్వహణ వ్యవహారాలు, దాంతో ముడిపడి ఉన్న సామాజిక, ఆర్థిక ప్రభావాలను సీఎం అక్కడి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రాజెక్టు నిర్మాణానికి ఎంత సమయం పట్టింది? ఎంత ఖర్చయింది? ఏయే సవాళ్లు ఎదురయ్యాయి? నిర్వహణకు అనుసరిస్తున్న విధానాలపై చర్చించారు.

### నేడు రాష్ట్రానికి సీఎం రేవంత్

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దావోస్, లండన్ పర్యటనను ముగించుకొని సోమవారం ఉదయం హైదరాబాద్ చేరుకోనున్నారు. ఈ నెల 15 నుంచి 18 వరకు దావోస్‌లో జరిగిన ప్రపంచ వాణిజ్య వేదిక (డబ్ల్యూఈఎఫ్) సదస్సులో పాల్గొనేందుకు సీఎం రేవంత్‌తోపాటు పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబుతోపాటు అధికారుల బృందం వెళ్లింది. అక్కడ పలువురు పారిశ్రామికవేత్తలతో సమావేశమై రాష్ట్రంలో పెట్టుబడుల కోసం పలు ఒప్పందాలు కుదుర్చుకున్నారు. అక్కడి నుంచి సీఎం లండన్ వెళ్లగా, పరిశ్రమల శాఖ మంత్రి సౌదీ అరేబియా వెళ్లారు. సీఎం లండన్ నుంచి సోమవారం ఉదయమే హైదరాబాద్ చేరుకుంటారు.

## అతీగతీలేని ఆ 14 రోడ్లు!

- ప్రధాన రహదారుల అభివృద్ధి గాలికి
- కేంద్రానికి ప్రతిపాదనతోనే సరి
- బడ్జెట్ చర్చలో చర్చకు రాని రోడ్ల అంశం

హైదరాబాద్, జనవరి 21(నమస్తే తెలంగాణ): పెరిగిన అవసరాలు, ట్రాఫిక్ రద్దీని దృష్టిలో పెట్టుకుని 14 ప్రధాన రాష్ట్ర రహదారులను జాతీయ రహదారులుగా గుర్తించాలని అప్పట్లో కేసీఆర్ ప్రభుత్వం కేంద్రానికి విజ్ఞప్తి చేసింది. కేంద్రం పట్టించుకోకపోవడంతో వాటిని రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోనే అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. ఇప్పుడు ప్రభుత్వం మారిన తర్వాత వాటి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

### ప్రస్తావన కూడా రాలే

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత వారంలోనే ఆర్ అండ్‌బీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కేంద్ర రవాణా మంత్రి నితిన్ గడ్కరీని కలిసి రాష్ట్రంలో అభివృద్ధి చేయాల్సిన రోడ్లతోపాటు పెండింగ్‌లో ఉన్న 14 రోడ్ల అంశాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. సాధ్యమైనంత త్వరగా వాటికి జాతీయ హోదా కల్పించాలని కోరారు. ఆయన సరేనని గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినప్పటికీ అధికారికంగా మాత్రం ఇప్పటి వరకు ఎలాంటి ప్రకటన విడుదల కాలేదు. మరోవైపు, ఆర్‌అండ్‌బీ శాఖ బడ్జెట్‌పై గత శనివారం ఆర్థికశాఖ మంత్రి భట్టి విక్రమార్క చర్చించినప్పటికీ ఈ రోడ్ల ప్రస్తావన మాత్రం రాలేదు. రాష్ట్ర ప్రభుత్వ తీరు చూస్తుంటే కేంద్రం ఈ రోడ్లకు జాతీయ హోదా ఇచ్చే వరకు వాటి అభివృద్ధి సాధ్యమయ్యే అవకాశాలు కనిపించడం లేదు. ఈ 14 రోడ్లను కలుపుతూ దాదాపు 1,656 కిలోమీటర్ల పొడవునా రోడ్లు అభివృద్ధి చేయాలని ఆర్ అండ్‌బీ అధికారులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

మరిన్ని వార్తలకు www.ntnews.com చూడండి

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL DISTRICT AND SESSIONS JUDGE-CUM-FAMILY COURT JUDGE, MEDCHAL MALKAJGIRI COURTS, At; Malkajgiri
O.S. No. 110 of 2023

Between:
E. Prashanthi @ Dr. E.Prashanthi, W/o. Late Dr. E.Babu Sridhar @ Babu Sridhar Esanakula & 3 others ...Plaintiffs
AND
The Tahsildar/ Mandal Revenue Officer, Choutuppal - Mandal, & 3 others ... Defendants

NOTICE
The All Concerned

Whereas the plaintiff E.Prashanthi @ Dr. E . Prashanthi W/o.Late Dr. E. Babu Sridhar @ Babu Sridhar Esanakula and 3 others have filed the above said suit before the Hon'ble Prl District and sessions Judge- Cum- Family Court, Medchal-Malkajgiri District for the plaintiffs No-1 to 4 as surviving class one legal heirs of the deceased Late Dr. E.Babu Sridhar @ Babu Sridhar, regarding the assets left by the Deceased, who died on 03-06-2021.

Notice is issued in the Name of All Concerned Defendants that in case anybody has any Objections in the said suit, he/she/they can file the objections to the same on or before 13-02-2024 in the above said court, failing which the plaint/suit shall be decided in accordance with law.

(BY THE ORDER OF THE HON'BLE COURT)
V. JAGAN MOHAN REDDY,
K. Mallikarjun & G. Gangadhar, Advocates,
O/o. Flat No.202, Floor-II, H.No. 1-8-3/22/2, Near Karachi Bakery, Surya Nagar, Chikkadpally, Hyderabad- 27 T.S., India. Ph: 9848384594.




## వైసీపీ, టీడీపీ దొందూ దొందే!

- ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల.. బాధ్యతల స్వీకరణ
- కాంగ్రెస్‌లో చేరిన మంగళగిరి ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

హైదరాబాద్, జనవరి 21 (నమస్తే తెలంగాణ): ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో వైసీపీ, టీడీపీ రెండూ దొందూ దొందేనని ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఘాటుగా విమర్శించారు. ఆ రెండు పార్టీలు బీజేపీ తొత్తులేనని ఆరోపించారు. ఆదివారం విజయవాడలో ఏపీసీసీ అధ్యక్షురాలిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆమె కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. వైఎస్సార్ ఆశయాలు ఒక్క కాంగ్రెస్‌లోనే నెరవేరాయని, ఆయన బిడ్డతో చేతులు కలపాలని, ఆంధ్రలో మళ్లీ వైఎస్సార్ ఆశయాలను సిద్ధింపజేద్దామని పిలుపునిచ్చారు. బీజేపీ మతతత్వ పార్టీ అని, మతం పేరుతో చిచ్చుపెట్టి, చలి కాచుకోవాలనేదే ఆ పార్టీ మంత్రమని విమర్శించారు. జగన్‌రెడ్డి క్రైస్తవుడైనప్పటికీ మణిపూర్ ఘటనపై స్పందించనేలేదని మండిపడ్డారు. టీడీపీ సైతం అదే వైఖరితో ఉన్నదని, బీజేపీకి వైఎస్సార్ వ్యతిరేకి అని గుర్తుచేశారు. ఏపీకి ప్రత్యేక హోదాను పాలకులు తీసుకురాలేకపోయారని ధ్వజమెత్తారు. వైఎస్ షర్మిల సమక్షంలో మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డితోపాటు ఆయన అనుచరులు కాంగ్రెస్‌లో చేరారు. అంతకు ముందు షర్మిల ర్యాలీగా విజయవాడ పార్టీ కార్యాలయానికి బయలుదేరగా.. ఆమె కాన్వాయ్‌ని పోలీసులు అడ్డుకున్నారు. దీంతో అక్కడ కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొన్నది. పోలీసుల తీరుపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేస్తూ, ఏం సార్.. భయపడ్డారా? అని ఏపీ సీఎం జగన్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించడం చర్చనీయాంశంగా మారింది.

# రేవంత్ జట్టులో 'సలహా' కొలువులు

- ముగ్గురు ప్రభుత్వ సలహాదారుల నియామకం
- ఢిల్లీలో ప్రభుత్వ ప్రతినిధిగా వేణుగోపాల్‌రావు

   

మల్లు రవి, వేం నరేందర్‌రెడ్డి, షబ్బీర్ అలీ, హర్కర వేణుగోపాల్‌రావు

హైదరాబాద్, జనవరి 21 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వం ముగ్గురు సలహాదారులను నియమించుకున్నది. వేం నరేందర్‌రెడ్డి, షబ్బీర్ అలీ, మల్లు రవికి క్యాబినెట్ ర్యాంకు హోదాతో ప్రభుత్వ సలహాదారుల బాధ్యతలు అప్పగించింది. టీపీసీసీ ప్రొటోకాల్ చైర్మన్ వేణుగోపాల్‌రావును ఢిల్లీలో ప్రభుత్వ ప్రతినిధిగా నియమించింది. ఈ మేరకు సీఎస్ శాంతికుమారి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.

### మల్లు రవి: కాంగ్రెస్‌లో నాలుగున్నర దశాబ్దాలుగా..

మల్లు రవి దాదాపు నాలుగున్నర దశాబ్దాలుగా కాంగ్రెస్‌లో కొనసాగుతున్నారు. 1980లో యూత్ కాంగ్రెస్ డాక్టర్ సెల్ చైర్మన్‌గా తన రాజకీయ జీవితాన్ని ప్రారంభించారు. రెండు సార్లు నాగర్‌కర్నూల్ ఎంపీగా, ఒకసారి ఎమ్మెల్యేగా గెలిచారు. ఉమ్మడి ఏపీలో రాష్ట్ర కార్యదర్శిగా పనిచేశారు. మహారాష్ట్ర, కర్ణాటక, కేరళ, యూపీ ఎన్నికల పరిశీలకుడిగా వ్యవహరించారు. ప్రస్తుతం టీపీసీసీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్‌గా ఉన్నారు.

| పేరు | బాధ్యతలు |
|---|---|
| వేం నరేందర్‌రెడ్డి | పబ్లిక్ అఫైర్స్ |
| షబ్బీర్ అలీ | ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనార్టీల సంక్షేమం |
| మల్లు రవి | ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధి |
| హర్కర వేణుగోపాల్‌రావు | ప్రొటోకాల్, పబ్లిక్ రిలేషన్ |

### షబ్బీర్ అలీ: దేశంలోనే తొలి మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి

రాష్ట్రంలోని అత్యంత సీనియర్ కాంగ్రెస్ నాయకుల్లో షబ్బీర్ అలీ ఒకరు. ఆయన 1970వ దశకం నుంచి పార్టీలో కొనసాగుతున్నారు. ఎన్‌ఎస్‌యూఐలో తన ప్రస్థానాన్ని ప్రారంభించారు. 1989లో తొలిసారి కామారెడ్డి నుంచి గెలుపొందారు. పలుమార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు, ఎమ్మెల్సీగా పనిచేశారు. దేశంలోనే మొదటి మైనార్టీ సంక్షేమశాఖ మంత్రిగా పనిచేశారు. మంత్రిగా అనేక శాఖలు చేపట్టారు. తాజా అసెంబ్లీ ఎన్నికల సమయంలో కామారెడ్డి నుంచి పోటీ చేయాలని భావించినా రేవంత్ రెడ్డి కోసం నియోజకవర్గాన్ని వదులుకున్నారు. అప్పుడు ఇచ్చిన హామీ మేరకు ఆయనకు ప్రభుత్వ సలహాదారు పదవి ఇచ్చారు.

### వేం నరేందర్‌రెడ్డి: రేవంత్‌తో 16 ఏండ్ల స్నేహం

వేం నరేందర్‌రెడ్డి ప్రస్తుతం టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడిగా ఉన్నారు. మొదటిసారి 2004లో మహబూబాబాద్ ఎమ్మెల్యేగా గెలిచారు. రేవంత్‌రెడ్డితో ఆయనకు సుమారు 16 ఏండ్లుగా స్నేహం ఉన్నది. టీడీపీలో ఉన్నప్పటి నుంచే వారిద్దరి అనుబంధం కొనసాగుతున్నది. 2015లో వేం నరేందర్‌రెడ్డి ఎమ్మెల్సీగా బరిలో దిగారు. ఆయనను గెలిపించేందుకు జరిగిన ప్రయత్నంలోనే ఓటుకు నోటు కేసు వెలుగులోకి వచ్చింది. ఇద్దరూ ఒకేసారి కాంగ్రెస్‌లో చేరారు. నాటి నుంచి టీపీసీసీ అధ్యక్షుడిగా, సీఎంగా రేవంత్‌రెడ్డి ఎదిగే వరకు నరేందర్‌రెడ్డి ఆయన వెంటే ఉన్నారు.

### హర్కర వేణుగోపాల్: రాష్ట్రంలో పెద్దగా తెలియకపోయినా..

హర్కర వేణుగోపాల్ గురించి రాష్ట్రంలోని నేతలకు పెద్దగా తెలియకపోయినా.. ఢిల్లీ పెద్దలందరికీ ఆయన సుపరిచితుడు. ఆయనది పెద్దపల్లి జిల్లా అబాది రామగుండం. టీపీసీసీ ప్రొటోకాల్ చైర్మన్‌గా ఆయన ఢిల్లీ పెద్దలకు, రాష్ట్ర నాయకత్వానికి మధ్య సమన్వయం కుదుర్చడంలో విశేష కృషి చేశారు. ఢిల్లీ నుంచి నేతలు ఎవరు వచ్చినా, వారికి రవాణా సౌకర్యాలు, బస, నేతలతో మీటింగ్‌లు ఇలా అన్ని అంశాలను ఆయన దగ్గరుండి చూసుకున్నారు.

# తెలంగాణలో పెట్టుబడులు పెట్టండి

- బహుళ జాతి సంస్థలకు మంత్రి శ్రీధర్‌బాబు వినతి
- జెడ్డాలో పలు సంస్థల ప్రతినిధులతో సమావేశాలు



హైదరాబాద్, జనవరి 21 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకురావాలని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు బహుళజాతి కంపెనీలకు పిలుపునిచ్చారు. రాష్ట్రంలోకి పెట్టుబడులను ఆకర్షించేందుకు సౌదీ అరేబియాలో పర్యటిస్తున్న ఆయన ఆదివారం జెడ్డాలో పలు సంస్థల ప్రతినిధులతో భేటీ అయ్యారు. సౌదీ యువరాజు ప్రత్యేక కార్యాలయ జనరల్ డైరెక్టర్ మహమ్మద్ బిన్ అబ్దుల్లా అల్ రాయెస్‌తోపాటు అరామ్‌కో, అల్ షరీఫ్ గ్రూప్ హోల్డింగ్స్, సెడ్కో క్యాపిటల్స్, జెడ్డా చాంబర్స్, సవోలా గ్రూప్, సౌదీ బ్రదర్స్ కమర్షియల్, పెట్రోమిన్ కార్పొరేషన్, బట్టర్జీ హోల్డింగ్ కంపెనీల ప్రతినిధులతో సమావేశమై రాష్ట్ర ప్రభుత్వ విధివిధానాలు, పారిశ్రామికవేత్తలకు అందించే ప్రోత్సహకాలు, రాయితీల గురించి వివరించారు. తెలంగాణలో నిరంతర విద్యుత్తు సరఫరాతోపాటు, నీటి లభ్యత, నాణ్యమైన మానవ వనరులు, ఆధునిక మౌలిక సదుపాయాలు, మెరుగైన కనెక్టివిటీ ఉన్నాయని చెప్పారు. దీంతో రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు పలు సంస్థలు సానుకూలత వ్యక్తం చేశాయి. మంత్రి శ్రీధర్‌బాబు వెంట రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్, పెట్టుబడుల అభివృద్ధి, ఎన్నారై వ్యవహారాల విభాగం ప్రత్యేక కార్యదర్శి విష్ణువర్ధన్ రెడ్డి ఉన్నారు.

